## క్లుప్తంగా

### లీకేజీలు లేకుండా తాగునీరు సరఫరా చేయాలి

శంకరపట్నం: పైపులైన్లు లీకేజీలు లేకుండా తాగునీరు సరాఫరా చేయాలని మిషన్ భగీరథ ఎస్ఈ రాములు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల శిక్షణ శనివారంతో ముగిసింది. ముగింపు శిక్షణలో ఆయన పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ అంజన్న, డీఈ ఖాజాపషీయోద్దీన్, ఏఈ మొగిళి, ట్రైనర్లు శ్రీరాములు, సురేశ్, కోటిలింగం పాల్గొన్నారు.

### విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయులు



విచారణ జరుపుతున్న డీఈవో

మానకొండూర్: పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఆదిత్య అనే విద్యార్థిని క్రమశిక్షణ పేరిట ఇద్దరు ఉపాధ్యాయులు చితకబాదిన ఘటనపై జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆదిత్య శుక్రవారం పాఠశాలకు వెళ్లాడు. ప్రార్థన సమయం ముగిసిన అనంతరం తరగతి గదిలోకి అందరితోపాటే వెళ్తున్న ఆదిత్యను శ్రీనివాస్, జైసింగ్ అనే ఉపాధ్యాయులు క్రమశిక్షణ పేరిట జుట్టు పట్టి చెంపలపై చితకబాదారు. విద్యార్థి స్పృహ తప్పి కిందపడిపోయాడు. వెంటనే ఉపాధ్యాయులు కారులో వెళ్లి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై శనివారం జిల్లా విద్యాధికారి ఆదర్శ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఎందుకు విద్యార్థిని చితకబాదారని ఉపాధ్యాయులనడిగి తెలుసుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు మృతి

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ శివారులోని చేపలకాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎల్ఎండీ ఎస్సై వివేక్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గౌరెల్లి కొండాపూర్‌కు చెందిన భూక్య రాజు, ధూలిమెట్ట మండలం కోటికల్ గ్రామానికి చెందిన లావుడియా వాగ్య ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్లుగా పని చేస్తున్నారు. ఆదిలాబాద్‌లో పనులు ముగించుకొని మహేంద్ర సుప్రో వాహనంలో హుస్నాబాద్‌కు బయలుదేరారు. తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారుకు రాగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని గమనించకుండా వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని ఎల్ఎండీ పోలీసులు మల్లికార్జున్, సురేశ్ కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరు అర్ధరాత్రి 2 గంటల తర్వాత మరణించారు. హెచ్చరిక బోర్డు లేకుండా రోడ్డుపై లారీని నిలిపి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### నలుగురిపై కేసు

జమ్మికుంట: అకారణంగా దూషించి జీవనోపాధి పొందే టైర్ల కొట్టు డబ్బాను ధ్వంసం చేసిన నలుగురిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి శనివారం తెలిపారు. పట్టణంలోని పాత మున్సిపల్ పక్కన గల ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 467 రోడ్డు పక్కన పట్టణానికి చెందిన కన్నూరి వెంకటయ్య అనే వ్యక్తి 13 సంవత్సరాలుగా రేకుల డబ్బాతో టైర్ల రిపేర్ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. పట్టణానికి చెందిన అదండ వెంకటమల్లు, గండికోట రాజేందర్, పల్లపు రవి, పల్లపు గోపి అనే నలుగురు దూషిస్తూ రేకుల డబ్బా షాపును తొలిగించి ధ్వంసం చేశారు.

### ఇంటర్ విద్యార్థి అదృశ్యం

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు శనివారం పోలీసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్ తెలిపారు.

### పరామర్శ



విష్ణును పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన అలువాల రమ్యకృష్ణ కుటుంబాన్ని, ప్రమాదంలో గాయపడిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణును శనివారం రామడుగు, కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్లు వీర్ల వెంకటేశ్వర్‌రావు, ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్ పరామర్శించారు.

### మాక్ పోలింగ్

జమ్మికుంట: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఎన్నికల మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

# నియామకం ఉన్నట్టా.. లేనట్టా..

- తొలిసారి దళిత మహిళా రిజర్వేషన్ కేటాయింపు
- రెండేళ్లుగా పాలకవర్గం లేని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్
- ఆశావహులకు తప్పని ఎదురుచూపులు



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ ఉత్తర తెలంగాణలో అతి పెద్ద రెండో మార్కెట్‌గా పేరుగాంచింది. కాటన్‌లో వరంగల్ మార్కెట్‌కు పోటీ పడుతూ ప్రభుత్వానికి ఆదాయం సమకుర్చుతోంది. పాలకవర్గం కాలం 2022 సంవత్సరంతో ముగిసి ప్రస్తుతం రెండేళ్లు కావొస్తోంది. గత రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ నియామకాలపై తొలిసారి దళిత మహిళా రిజర్వేషన్ కేటాయింపు జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకుల చుట్టు ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నా.. నియామకంపై స్పందన కరువైంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికలే అడ్డంకిగా మారాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. పాలకవర్గం కూర్పు జరగడం లేదు. హుజూరాబాద్ నియోజకవర్గంలో జమ్మికుంట మార్కెట్ కమిటీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. చైర్మన్ నియామకంపై జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో రాజకీయ నాయకులు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. మార్కెట్ నియాకమం ఉన్నట్టా.. లేనట్టా అనే సందిగ్ధంలో ఆశావహులున్నారు.

**ఈటల తనదైన శైలిలో..!**

మల్కాజిగిరి పార్లమెంట్‌కు ప్రస్తుత బీజేపీ ఎంపీగా ఈటల రాజేందర్ కొనసాగుతున్నారు. ఈటల హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతినిధ్యం వహిస్తున్న సమయంలో తనదైన శైలిలో నియామకాలు చేపట్టారు. పరిపాలన, రాజకీయంలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు. అప్పుడు మార్కెట్ చైర్మన్ నియామకంలో అన్ని తానై పార్టీ, నాయకులను ఒక్కతాటిపై నడిపించారు. ఈటల సూచించిన వారికి పదవి వరించింది.

**రైతులకు న్యాయం..**

కొత్త పత్తి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఆర్‌డీడీఎం పద్మావతి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కానీ మద్దతు ధర రూ.7,521 ఉండగా.. రూ.6,960 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తేమ ఎక్కువగా ఉంటుందని, ధరలు తక్కువ పలుకుతున్నాయని వ్యాపారులు తెలుపుతున్నారు. పాలకవర్గం ఏర్పాటుతో రైతుకు ధరలు, సమస్యల విషయంలో హెచ్చుతగ్గులపై చర్చించి, రైతులకు న్యాయం చేసేలా అవకాశముంటుందని, వెంటనే నియామకం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**ఆశావహులు వీరే..**

సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వారి సతీమణుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు సుంకరి రమేశ్, మొలుగూరి సదయ్య, గూడెపు సారంగపాణి, పూల్లూరి సదానందం, పలువురు సతీమణులను చైర్‌పర్సన్ చేయాలని ఉబలాటపడుతున్నారు. వైస్ చైర్మన్ కోసం ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన ఇంగిలే రామారావు, జమ్మికుంట పూదరి శివకుమార్, వీణవంక మండలాలకు చెందిన పలువురు అధిష్టానంలోని పెద్ద నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడుతా



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

- మాజీ మేయర్ రవీందర్‌సింగ్

తిమ్మాపూర్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, పల్లెలు, పట్టణాల అభివద్ధికి నిధులు తెస్తానని కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మన్నెంపల్లి, పర్లపల్లి, మానకొండూర్ మండలం దేవంపల్లిలోని గురుకుల పాఠశాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలంటూ విద్యావంతులను కోరారు. తాను మేయర్‌గా కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. పొన్నం అనిల్‌గౌడ్, కెంసారం తిరుపతి, ముప్పిడి సంపత్‌రెడ్డి, చిందం చంద్రమౌళి, సుద్దాల రాజేశ్, నార్ల అశోక్, దరిపెల్లి వేణుకుమార్ తదితరులున్నారు.

మన్నెంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలోని పొన్నం యువసేన సభ్యులు శనివారం టైలు, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ హాజరై విద్యార్థులకు టైలు, బెల్టులు అందించారు. రవీందర్‌సింగ్, పొన్నం అనిల్‌గౌడ్ మాట్లాడారు. మన్నెంపల్లి పాఠశాలలో 10వతరగతిలో 9, 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఉచితంగా చదివిస్తానని రవీందర్‌సింగ్ హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, మంజుల, సిరికొండ శ్యామల, గోవిందరావు, నార్ల అశోక్, రావుల శ్రీనివాస్, తిరుపతి, పారునంది సంపత్, బీనపల్లి బాలయ్య, పోతుగంటి సంపత్, కోలిపాక రాజమొగిలి, రాములు, సంపత్, గుర్రం జగదీశ్, సుధగోని సదయ్య, ధరిపెల్లి వేణు, బినపెల్లి సంపత్, నిరంజన్, ఉపాధ్యాయులున్నారు.

# ఐరిష్, ఓటీపీల ద్వారానే ధాన్యం డబ్బులు




దుద్దెనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

సైదాపూర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల ధాన్యం డబ్బులు ఐరిష్, ఓటీపీల ద్వారానే చెల్లించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. శనివారం దుద్దెనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. నాణ్యమైన వడ్లనే తూకం వేయాలని సూచించారు. తేమ శాతం పరిశీలించి వ్యవసాయ విస్తర్ణాధికారి ధ్రువీకరణ తర్వాతే వడ్లను తూకం వేసి మిల్లుకు పంపించాలని ఆదేశించారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 ప్రభుత్వం ప్రకటించిన బోనస్ చెల్లిస్తామన్నారు. 48 గంటల్లోపు రైతులకు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని అన్నారు. ప్రతి కేంద్రంలో సన్న, దొడ్డు వడ్లు వేర్వేరుగా కుప్పలు పోయాలని సూచించారు. తూకం వేసే ముందు రైతులు భూమి పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్సు పత్రాలు కేంద్రాల్లో ఇవ్వాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

చిగురుమామిడి: బొమ్మనపల్లి, రేకొండ, చిగురుమామిడి గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తనిఖీ చేశారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలని సూచించారు. తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఎంపీడీవో ఖాజామొయినోద్దీన్, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ఖాజా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అన్వర్, ఆర్ఐ అరుణ్‌కుమార్, ఏపీఎం మట్టేల సంపత్, సీసీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వీవో సభ్యులు మంజుల, రజిత, సుజాత, కనకవ్వ, జ్యోతి, రైతులున్నారు.

### ఐరన్ స్తంభాలు ముట్టుకోవద్దు



గన్నేరువరంలో రైతులతో మాట్లాడుతున్న డీఈ విజేందర్‌రెడ్డి

గన్నేరువరం: వర్షాలు కురిసిన సందర్భాల్లో ఐరన్ విద్యుత్ స్తంభాలను ముట్టకోవద్దని కరీంనగర్ విద్యుత్‌శాఖ సేఫ్టీ డీఈ విజేందర్‌రెడ్డి సూచించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పొలం కార్యక్రమంలో భాగంగా శనివారం గన్నేరువరం, మైలారం గ్రామాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. పాతబడిన సర్వీస్ తీగలు, ఇంట్లో పాత త్రీపిన్ ప్లగ్‌లను తొలగించాలన్నారు. స్టార్టర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. ఏఈ అంజనేయులు, మున్నూరు కాపు గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు బాలయ్య, పుల్లెల రాము, కయ్యం సంపత్, వెంకటమల్లు, పర్శరాములు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రాల మార్పులో మతలబేమిటో..!

- ప్యాక్స్ నుంచి ఐకేపీకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మార్పు?
- ఇదెక్కడి అన్యాయమంటున్న ప్యాక్స్ నేతలు

కరీంనగర్ అర్బన్: సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం రిక్తహస్తం చూపుతుండటం అనుమానాలకు తావిస్తోంది. ఏళ్లుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్యాక్స్ కేంద్రాలను కాదని ఐకేపీకి కట్టబెట్టేందుకు దాదాపు రంగం సిద్ధమైనట్లు సమాచారం. అసలే పరిస్థితి అంతంతమాత్రమే ఉన్న ప్రాథమిక సహకార సంఘాలకు ఆదాయ వనరుతోపాటు రైతులకు సేవ చేసే పరిస్థితిని దూరం చేస్తుండటం విడ్డూరం. కొన్నేళ్లుగా వానాకాలం, యాసంగి సీజన్లలో ప్యాక్స్, ఐకేపీ, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే పలువురు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కొనుగోలు కేంద్రాలను ఇష్టారీతిగా మార్చుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొన్నింటిని ఐకేపీకి మార్చడం గమనార్హం. ఎలాంటి ఆరోపణలు లేకున్నా, అవకతవకలు జరగకపోయినా వేరే వారికి ఎలా అప్పగిస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మానకొండూర్ నియోజకవర్గంలో రంగపేట, పోచంపల్లి, కల్లెడ, లింగాపూర్, పచ్చునూరు, ఊటూరు గ్రామాల్లో ప్యాక్స్ ధాన్యం కొనుగోలు చేసేది. కానీ ఈసారి ఐకేపీకి అప్పగించారని విశ్వసనీయ సమాచారం. సదరు ప్రాంతాల్లో ప్యాక్స్ రైతులకు ఎప్పటికప్పుడు సేవలందించగా.. ధాన్యాన్ని త్వరితగతిన మిల్లర్లకు రవాణా చేసింది. సౌకర్యాల కల్పనతోపాటు రైతుల ఖాతాకు నగదు జమ చేయడంలోనూ సత్వర సేవలందించగా.. తాజాగా కొనుగోలుకు దూరం పెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఏళ్లుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న తమను కాదని ఐకేపీకి ఇవ్వడమేమిటని ప్యాక్స్ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థి జేఏసీ నాయకులకు స్వాగతం

రామడుగు: శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్‌కు మద్దతుగా స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో చేపట్టిన కరీంనగర్ నుంచి కొండగట్టు పాదయాత్రకు వెదిర గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో యువకులు స్వాగతం పలికారు. చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ.. తెలంగాణలోని నాలుగు యూనివర్సిటీ విద్యార్థులు ఈ పాదయాత్ర చేపట్టారన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

చిగురుమామిడి: ప్రతీ ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దుబ్బాక బాల్‌రెడ్డి కోరారు. శనివారం బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో భోజన విరామ సమయంలో పీఆర్‌టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. 2018 నవంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 లోపు వారికున్న సర్వీసులో కనీసం మూడు సంవత్సరాలు పని చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మలినాథశాస్త్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కార్యవర్గం ఎన్నిక

హుజూరాబాద్‌రూరల్: వెంకట్రామ్‌పల్లి గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షుడిగా చొప్పరి కిషన్, ఉపాధ్యక్షులుగా కన్నెబోయిన రాజయ్య, ఇల్లందుల లక్ష్మణ్, కార్యదర్శిగా బోయిని కిషన్, సంయుక్త కార్యదర్శిగా సమ్మయ్య, చొప్పదండి దేవరాజు, ప్రచార కార్యదర్శిగా మహేశ్ సమ్మయ్య, కోశాధికారిగా రామగిరి శ్రీకాంత్, సభ్యులుగా ముద్దమల్ల రవి, చొప్పదండి వసంత్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల ఓదెలు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వంతడుపుల బాబు, రిటైర్డు టీచర్ చందుపట్ల జనార్దన్, బహుజన నాయకులు అంబాల కుమారస్వామి, సారంగం తదితరులున్నారు.

**రెడ్డి యూత్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా..**

గన్నేరువరం: తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా యూత్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గన్నేరువరంకు చెందిన కాంతాల ప్రశాంత్‌రెడ్డి నియమితులయ్యారు. రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ఎలిమినేటి సుమన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని కరీంనగర్‌లో అందజేశారు.

### కలెక్టర్‌కు కృతజ్ఞతలు

హుజూరాబాద్‌రూరల్: కళారంగాన్ని కాపాడేందుకు జిల్లా కేంద్రంలో కళాభవన్ తిరిగి పునః ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ మేయర్, మున్సిపల్ అధికారులకు శనివారం జిల్లా తెలంగాణ వృత్తి కళాకారుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కళాభవన్ అందుబాటులోకి వస్తే కళాకారులు వివిధ సామాజిక అంశాలపై అవగాహన ఇస్తూ ప్రజలను చైతన్యపరిచే అవకాశముందన్నారు. సంఘం బాధ్యులు కృపాదానం, కనకం రమణయ్య, సల్వాజి ప్రవీణ్, గోపాల్‌రావు, రాధాకృష్ణ, గొల్లపల్లి రవీందర్, మురళి, మధు తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### కాలిఫోర్నియాలో బతుకమ్మ సందడి



బతుకమ్మ వేడుకల్లో చొప్పదండి వాసులు

చొప్పదండి: అమెరికాలోని కాలిఫోర్నియాలో చొప్పదండికి చెందిన ఎన్ఆర్ఐలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బేకర్స్ ఫీల్డ్ నగరంలో తెలుగువారి ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా వేడుకలను నిర్వహించినట్లు హిందూ టెంపుల్ సెక్రటరీ ఇప్పనపల్లి వేణుగోపాల్ తెలిపారు. అర్జున్, సంగీతారెడ్డి హిందూ సంప్రదాయం ప్రతిబింబించేలా భోజనాలు ఏర్పాటు చేయగా.. అందమైన బతుకమ్మలను పేర్చి పండుగ చేసుకున్నామన్నారు.



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని 22వ వార్డు ఇస్లాంపుర్‌లోని నివాస గృహాల మధ్య ఉన్న రహదారిపై పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. పాములు సంచరిస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి**
**సమ్మయ్య, కమిషనర్, హుజూరాబాద్, సెల్ నం.: 7032651516**

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

### మద్దతు ధరతో ధాన్యం అమ్ముకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: రైతులు శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరతో అమ్ముకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. కురిక్యాల సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని 21 గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని రైతులు ఇబ్బంది పడకుండా కాపాడుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత-శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు వెలిచాల తిరుమల్‌రావు, దూలం బాలగౌడ్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, నాయకులు పురుమల్ల మనోహర్, పడిదపల్లి కిషన్, కంకణాల రాజగోపాల్‌రెడ్డి, సత్తు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

| కాంప్లెక్స్ పేరు | ఖాళీల సంఖ్య | అద్దె రూ. |
| --- | --- | --- |
| అమ్మవారి కాంప్లెక్స్ | 04 | 1,680 |
| భీమేశ్వర సదన్ ఏసీ | 03 | 1,344 |
| భీమేశ్వర సదన్ సూట్స్ | 04 | 1,680 |
| భీమేశ్వర గెస్ట్‌హౌస్ | 05 | 2,800 |
| నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ | 04 | 1,008 |
| నందీశ్వర నాన్‌ఏసీ | 08 | 560 |
| నందీశ్వర సూట్స్ | 04 | 2,800 |
| లక్ష్మీగణపతి కాంప్లెక్స్ | 05 | 448 |
| పార్వతీపురం స్పెషల్ | 03 | 672 |
| పార్వతీపురం సాధారణ | 08 | 336 |

- వేములవాడ

### కళాకారుడికి సన్మానం

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన సాయిచిత్ర రాజు శ్రీషిర్డీ సాయిబాబా పాత్రలో నటన విభాగంలో శ్రీసాయి మహానుభావ జాతీయ పురస్కారం అందుకోగా.. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు శాలువాతో మండల కేంద్రంలో సన్మానించారు. రాజు కొంతకాలంగా సాయిబాబా పాత్రలో తనదైన ముద్ర వేసి మెప్పిస్తున్నారు. ఇటీవల సాయిబాబా జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా చిలుకలూరిపేటకు చెందిన శ్రీజయ జయ సాయి ట్రస్టు అధ్యక్షుడు పూసపాటి బాలాజీ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. శాసన సభ్యుడు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా సన్మానంతోపాటు అవార్డు అందుకున్నారు.



రాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**గౌడ సంఘం సభ్యులకు..**

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బుర్ర తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తిరుపతిగౌడ్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి బుర్ర చిన్న మల్లేశ్‌గౌడ్‌ను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో శాలువాలతో సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్ల చంద్రారెడ్డి, మాతంగి అనిల్, న్యాత జీవన్, మీసం రాములు, పుల్లెల జగన్, ముడికే అజయ్, బుర్ర శ్రీకాంత్‌గౌడ్, మంగారపు అనిల్, దేశరాజ్ నవీన్, కూన కొమురయ్య పాల్గొన్నారు.

### పతకాలు సాధించిన సైనిక్ విద్యార్థులు

చొప్పదండి: రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్.దినేశ్, జె.రోషన్ విలు విద్య పోటీల్లో బంగారు, రజత పతకాలను సాధించినట్లు డైరెక్టర్ కేసీరావు తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీలు కరీంనగర్‌లోని మానేరు డ్యాం వద్ద నిర్వహించారని, వీరు హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

### మంచినీటి శుద్ధీకరణ యంత్రం అందజేత

హుజూరాబాద్‌రూరల్: బోర్నపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంచినీటిని శుద్ధి చేసే యంత్రాన్ని అందజేశారు. పాఠశాలలో తాము చదువుకున్నందుకు గుర్తుగా రూ.10వేలు విలువ చేసే యంత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. రావుల వేణు, సంపంగి రాజేందర్, మచ్చికట్ల కోటిలింగం, ముక్క నరసింగం, నరసింగం, బండ రాజిరెడ్డి తదితరులున్నారు.

**ఉచిత బస్సు పాసులు..**

హుజూరాబాద్‌రూరల్: కనుకులగిద్దె గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో దివ్యాంగులకు శనివారం హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ ఉచితంగా బస్సు పాసులను పంపిణీ చేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆర్టీసీ ఉచిత బస్సు పాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### వాలీబాల్ రన్నర్ రామడుగు

రామడుగు: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 వాలీబాల్ విభాగంలో రామడుగు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థుల జట్టు రన్నర్‌గా నిలిచినట్లు పీడీ రుపారాణి తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, సుంకె ఆశాలు, బర్కత్‌అలీ తదితరులు అభినందించారు.

### ఆలయ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరినట్లు శనివారం గడ్డివానిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డి శ్రీనివాస్ తెలిపారు. పార్టీ కోసం పని చేసిన వాళ్లకి అధిష్టానం పదవులిచ్చి న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.